మూడు కొండలు!

మూడు దిక్కులుగా!

మూడు కొండ దిక్కుల ఊళ్ళు!

కొండల మీద నుండి కిందికి దించేశారు!

మూడు దిశల నుంచి వచ్చే పల్లపు నడకదార్లు!

మూడు రోడ్ల కూడలిగా మారిపోయాయి!

మూడు రోడ్ల మీద!

పల్లపు ప్రాంతం నుండి బస్సులు వచ్చి మూడు దిక్కులకు విడిపోయి అడవి ప్రాంతాల ఊళ్ళకు వెళ్తూ వస్తుంటాయి.

శాంతమ్మ టీ పాక!

మూడు రోడ్లు కలిపిన దగ్గర ఒక పక్కగా తురాయి చెట్టుకీ కాగుచెట్టుకీ మధ్యన వుంది.

ఉదయపు సూర్యుడు కొండ మీదకు రాకముందు టీ పాకలో పొయ్యి రాజుకుంటుంది! సాయంకాలపు సూర్యుడు కొండ వెనక్కి వెళ్ళిపోయిన తరువాత ఆరిపోతుంది.

మూడు రోడ్ల మీద వాహనాలు మనుషులూ మాటలూ కేకలూ హడావిడి!

వాహనాలు రొదగా వెళితే మనుషులు పోర, పోరి-చోద్యంగా వచ్చి పోతుంటారు.

శాంతమ్మ టీ పాకలో రెండు పక్కలా కొయ్య బల్ల బెంచీలు.

బస్సులో అలసి వచ్చిన వాళ్ళూ- బస్సుల కోసం ఆత్రంగా చూసేవాళ్ళూ - రోడ్ల మీద తగువుల కేకలు తెగకుండా ముడి పెట్టదలచిన వాళ్ళూ టీ పాకలోని బల్ల బెంచీల మీదకి చేరతారు.

శాంతమ్మను టీ అడిగి మాటాడుకుంటూ తాగుతారు. తాగిన తరువాత కూడా కదలకుండా కూచొని మాటాడుకుంటారు.

ఎన్ని హడావిడి వ్యవహారాలు ఎలా వున్నా శాంతమ్మ నింపాదిగా టీ కాస్తూ ఆలోచిస్తున్నట్టుగా వుంటుంది. అడిగిన వాళ్ళకు టీ అందించి మళ్ళీ ఆలోచనల్లోకి వెళ్ళిపోయినట్టుగా వుంటుంది.

ప్రతి రోజూ టీ తయారు చెయ్యడానికి పాల కోసం ఉదయపు చీకట్లో వ్యాపకం! అలా ఆ వ్యాపకంలో తిరిగినప్పుడు ఆమెకు వెనకటి జ్ఞాపకాలు వద్దనుకున్నా వస్తుంటాయి.

కొండల్లో టీ లేని రోజులు!

కొండ కోనల్లో పంటలూ మొక్కలూ లతలూ పూలూ పళ్ళూ వృక్షాలూ మహా వృక్షాలూ మాత్రమే వున్న రోజులు!

పక్షులు! అవెన్ని రకాలు?!

జంతువులు! అవెన్ని జాతులు?!

అన్నిటి మధ్యన మానవుడు.

అడవిలో ఆదిమానవుని మహదానందం!

పశు సంపద?!

పశువుల పాలు దూడలు తాగేవి! తల్లి పాలు బిడ్డలు తాగినట్టే!

అప్పుడు తన ఊరికి వచ్చిన పల్లపు మనిషికి టీ అలవాటు.

అతడు పశువుల పాల పొదుగుల్ని చూశాడు. పశువుల పాలెందుకు పిండరన్న పల్లపు ప్రశ్న!

ఆ ప్రశ్నకు తల్లి పాలు బిడ్డ తాగి బతకలేదా!

అలాగే పశువుల పాలు దూడలు తాగి బతుకుతున్నాయన్న కొండ జవాబు!

రోడ్లు పడ్డాయి! పల్లపు పట్నపు మనుషులు దిగారు. కొండ టీ పాకలు వేసేరు. కొండకి టీ మాత్రమే ఇచ్చి పాలూ పెరుగూ మజ్జిగా- వెన్నా స్వంతం చేసుకున్నారు.

ఆనాటి పద్ధతి పోయింది!

ఆ తరువాత పాల కోసమే పశు సంపద!

కొండ పశువుల్ని కాసింది! పల్లం రక్తపు పాల జున్ను తింది.

మార్పు! నాగరిక మానవుడు తన కోసం తెచ్చిన వ్యాపారపు మార్పు. పాలల్లో నీళ్ళ వ్యాపారంగా మార్పు.

ఇప్పుడు ఇక్కడ నీళ్ళు కలవని పాలు దొరకవు గాక దొరకవు!


శాంతమ్మ రోడ్ల కూడలిలో గల టీ పాక వైపు చేతిలో పాల తపేలాతో తల మీద టీ తయారు చేసే సామాన్ల గంపతో నడక ఆలోచనలు.

పల్లపు పట్నాల మనుషుల వ్యాపారం పట్టనగ్గాల్లేకుండా కొండల్ని పట్టుకున్న రోజులు.

మనిషికి మనిషి బాకీ పడ్డం! బాకీ తీర్చడం ఆలస్యం అయితే బాకీ అనంతంగా పెరగడం. బాకీ తీర్చలేకపోతే మనిషిని, మనిషి శ్రమ ఫలితాలన్నింటినీ స్వంతం చేసుకోవడం! ఒక మనిషి కింద అనేక మంది మనుషులు బానిసలుగా బతకడం.

కొండలన్నీ కలగాపులగపు కంగాళీ! సర్వే సర్వత్రా ఘోర కలి!

అప్పుడు ఒకానొక సూర్యోదయాన ఒకానొక ప్రచార దళం వచ్చింది!



# కొత్త

పదిమంది చేతిలో జండాలు!

పది మంది ఒకే మాట నినాదం! పది మంది నినాదపు పిడికిలి బిగింపు.

అప్పుడు ఇంటికి వచ్చిన ప్రచార దళానికి శాంతమ్మ టీ ఇచ్చింది! అలసిన ప్రచార దళం శాంతమ్మ ఇచ్చిన టీ తాగి మెచ్చుకుంది! ఆ దళ హృదయపు మెచ్చు మాట



# ...తి భూషణం

కొండ కొత్త సత్యాన్ని చూపింది! కొండ కొత్త ఆలోచనలు చేసింది. కొండ కొత్త కాంతులు నింపుకుంది! కొండ గాలి వేడెక్కిపోయింది!

ప్రచార దళాల ముక్త కంఠ నినాదం! కొండల్లో ధమర్థారుల ప్రళయ ఝంకార నాదంగా మారిపోయింది.

వని శాంతమ్మ పొంగిపోయింది!

శాంతమ్మ చేయి పట్టినవాడు ఆ ప్రాంతాన పేరు పొందిన విలుకాడు.

ధనస్సు నుండి బాణం వదిలితే గురి తప్పదు!

తన విలుకాడు ప్రచార దళం మెప్పులో కలిసిపోయాడు.

శాంతమ్మ ఇంట్లో కూడా చర్చలు! నిర్ణయాలు! నిర్ధారణలు! విమర్శలూ ఆత్మ విమర్శలూ!

నలుదిక్కులా ఓంకార నాద ధ్వని!
ఓంకార నాదంలో లయించిపోయిన తన విలుకాడు!
శాంతమ్మ చారడేసి కళ్ళల్లో సుడి తిరిగిన కన్నీరు.
ఆ తరువాత ఆ ప్రాంతమంతా కన్నీటి కాలువలు!
అదంతా కన్నీటి కాలం!
కన్నీటి కాలంలో ఒంటరి శాంతమ్మ!
కన్నీటి కాలంలో కాలం నింపిపోతున్న శాంతమ్మ.
ఆ కన్నీటి కాలంలో శాంతమ్మ కొత్త మనిషిని చూపింది. అతను వచ్చిన వాహనం తన ఇంటి ముందు ఆగి వుంది!

వచ్చిన యువకుడు తన విలుకాని లాగే చురుకు చూపు వాడు! బాగా పొడగరి! శరీరం మృదుత్వాన్ని చిప్పిలుతుంది! కొండ కన్నీటిని మృదువుగా తుడిచి కొత్త పద్ధతికి మలచడానికి వచ్చినవాడుగా శాంతమ్మకు కనిపించాడు.

"అమ్మా" అని శాంతమ్మను పిలిచాడు.

"అమ్మా" అన్న అతని పిలుపు ఆవేదనగానూ ఎప్పటిదో మార్పు కడుపులోని జాలి పేగుల్ని కదిల్చినట్లు సంపన్నమైందిగా శాంతమ్మకు వినిపించి అనిపించింది!

"ఏడుస్తూ ఎందుకమ్మా కాలం వెళ్ళబుచ్చుతావు? తగిన ఏర్పాటు చేస్తాను. ఆ రోడ్డు వారలో టీ కొట్టు పెట్టు. పది మందిలో పడితే పాతకాలం మరచిపోతావు"

శాంతమ్మ ఆశ్చర్యంగానూ, అనుమానంగానూ అతని కళ్ళలోకి చూసింది. తనకి టీ బాగా తయారు చెయ్యడం వచ్చునని ఇతనికెలా తెలుసు?!

అలా ఆశ్చర్యంగా చూస్తున్న తనను 'ఏమి సమాధానం చెబుతావు' అన్నట్టుగా చూశాడు!

అప్పుడా చూపులో ఏ మాయా, ఏ మర్మం కనిపించలేదు! శాంతమ్మ కాదనలేకపోయింది!

తన వాడూ, తన కాలం పోయిన తరువాత శాంతమ్మకి ఈ టీ అమ్మకం ఒక వ్యాపార వ్యాపకం!

దళాలకూ దళ నాయకులకూ టీ కాచి మెప్పు పొందిన శాంతమ్మ రోడ్డు పక్కన హోటల్లో ఉద్యోగులకూ కాంపీ వాళ్ళకూ ఇప్పుడు టీ అమ్మకం!

టీ ఇవ్వడం! డబ్బులు పుచ్చుకోవడం!

తనలో ఈ మార్పు... తన జీవనంలో మార్పు... తన పద్ధతిలో మార్పు!

టీ వ్యాపక వ్యాపారంలోకి శాంతమ్మ దిగి ఇప్పుడు జరుగుతున్నది చూస్తుంది.

అడవిలో అనంతంగా లేచిన కాలనీలూ ఆఫీసులూ పాఠశాలలూ కొత్త రకపు కట్టడాలు!

తీగల స్తంభాలూ- తీగల నుండి జారిన రకరకాల వెలుగుల వింత కాంతులు!

కాగడాల కాగు నూనెల కాంతి మారిపోయి కళ్ళు మిరుమిట్ల కాంతి!

కావిళ్ళూ తల గంపలూ పోయి సంతలకు సైకిళ్ళ మీద ఆడా మగా తొడ తొక్కిడి ప్రయాణాలు!

ఆఫీసుల్లో తెల్లబట్టల కుర్చీలు! కుర్చీల ఇళ్ళలో సింగారపు రంగులు! సింగారపు రంగుల్ని అనుకరిస్తున్న గిరి సీమలు!!

అంతా సరికొత్త కోలాహలం.

చెట్లు పోవడంతో చిలకలు పోయాయి.

అడవి కాయలూ పళ్ళూ పోవడంతో అన్ని రకాల పక్షులూ పోయాయి.

లారీలు రావడంతో వృక్షాలూ మహా వృక్షాలూ మాయమైపోయి అడవి జంతువు అగుపడకుండా పోయింది.

ఆహారపు పంటలు పోయి వ్యాపారపు పంటలు వచ్చి పచ్చని కొండల్లో మరుగుజ్జు మొక్కల సస్యవనం?!

ఇప్పుడు అధునాతనంగా కనిపించే ప్రతి మార్పు వెనకా ఏదో పెను స్వార్థం సున్నితంగా పెనవేసుకుంటున్నట్టు ఆమెకు అనిపిస్తుంది.

# చెట్టు నిద్రిస్తున్నది

సాయం ఆతురత తగ్గిన పిదప
పక్షులు గూళ్ళలో అల్లరి నోళ్ళను లెక్క చూసుకుంటున్నప్పుడు
చూస్తుండగానే; చీకటి చిక్కపడుతుంది
బయట చుట్టూ పరుచుకున్న వేళ్ళు
వేగిరం నిద్రలోపడిపోతాయ్
సంతృప్తిగా చెట్టు నిద్రకుపక్రమిస్తుంది

ఆకులన్నీ, వేళ్ళు ముడుచుకుని
కొమ్మలు చేతులు విదుల్చుకుని
కాండం- ఒంటి కోడు మంచం మీద
ఆకుపచ్చ ఆహ్లాదంగా అలిసి సొమ్మసిల్లి నప్పుడు
చెట్టు నిద్ర పోతున్నది

అర్థరాత్రి ఎపుడో-తాను
ఆ ప్రక్క నుండి; ఈ ప్రక్కకు దొర్లినప్పుడు
కొమ్మల గుబురుల్లో ఉలిక్కి పడ్డ తల్లి పక్షి
రెక్కలు విదుల్చుకుని నిద్రలో నింద్రొక్కుకుంటున్నప్పుడు
చెట్టు గాఢంగా నిద్రపోతున్నట్టు

ఒళ్ళంతా అల్లుకు పోయిన మల్లె తీగ ఒకటి
బుట్టెడు పూలను బోదె చుట్టూ పరిచినప్పుడు
తెలిసీ తెలియని పారవశ్యపు టంచుల్లో
అపుడే కురుస్తున్న తొలి మంచు తెరల్లో
తలనిండా ముసుగు తన్నుకు
చెట్టు-మైమరచి నిద్రిస్తూనే వున్నది
ధ్వజస్తంభం చుట్టూ ఇంకా చీకటి తెరలు విడిపడక ముందే
కళ్ళు నులుపుకుంటున్న గారాల చిన్ని పక్షులు
కొమ్మకొమ్మకు జేగంటలై ప్రేలాడుతున్నప్పుడు
ఆకాశం హారతి పళ్ళెంలో
ఇక సూర్యుడు
కర్పూరంగా వెలిగే శుభసమయాన
చెట్టు నిద్రలేస్తుంది

పరాపరి కర్మసాక్షి
వెదజల్లే పసుపు-కుంకుమల్ని స్వీకరించి
తొలివేడి వెలుగును
కళ్ళ కద్దు కుంటుంది;

పి.రావ్‌నారాయణ్

సహజత్వాన్ని కోల్పోయిన వేషభాషల వెనక అందమైన అబద్ధపు బతుకు మాట ఆమెకు సుస్పష్టంగా వినిపిస్తుంది.

జిగేల్ మనిపించే ప్రతి మెరుపు వెనక - పెను చీకటి పెను చీకటి అలుముకున్నట్టే - నవ నాగరికతను ప్రతి బింబించే ప్రతి పని వెనక పెద్ద వ్యాపారం ఆక్రమించడం ఆమెకు కనిపిస్తుంది.

మూడు కొండల మధ్య - మూడు కొండ దిగువ కాలిబాట లోనూ - మూడు రోడ్ల కూడలి మీద - ఆమెకు సరికొత్త అబద్ధం ఇంతింతగా వచ్చి గిరిజనుల జీవనాడుల్లోకి అనంతంగా చేదుతున్నట్టు ఆమె గ్రహించి అశాం తిగా ఆలోచిస్తుంది.

ఆలోచిస్తూ శాంతమ్మ టీ పాకలో పొయ్యి రాజేసింది.


ఉదయపు బస్సు తన శబ్దంతో రోజువారీ ఉదయపు నిశ్శబ్దాన్ని చెదరగొట్టింది! ఆ శబ్దం విని శాంతమ్మ టీ మరగడానికి పొయ్యిలో కర్రల్ని ఎగదోసింది.

బస్సు వచ్చి మూడు రోడ్ల కూడలిలో ఆగింది.

బస్సులో వస్తున్న రోజు వారీ అమ్మాయి రోజులా డాబుగా బస్సు దిగింది. బస్సులో నుండి తొంగి తొంగి చూస్తున్న మగ ముఖానికి రివాజుగా చెయ్యి ఊపింది! ఇంకా చూస్తున్న అతనికి తన చేతిని పెదాల మీద పెట్టుకొని అతని వేపు చూపింది. అతను ఆ అమ్మాయి అరచేతిని చూస్తూ ముద్దు పెట్టినట్టుగా బస్సులో నుండి మూతి పెట్టాడు.

శాంతమ్మ బస్సులోని ముఖాన్ని చూసింది. అంతకు ముందు చూసిన ముఖం కాదు.

బస్సు ఆ కొత్త ముఖాన్ని మోసుకుంటూ వెళ్ళిపోయింది. రోజు వారీ అమ్మాయి టీ పాకలోకి వచ్చింది. వచ్చిన వెంటనే "అవ్వా! నా బస్సుందా?" అని రోజు వారీ ప్రశ్న వేసింది. శాంతమ్మ "వుందని" సమాధానం చెప్పింది.



"నిజమా?" అని సందేహంగా అదే రోజు వారీ సందేహాన్ని వెలిబుచ్చింది.

శాంతమ్మ తలలోని పాత నరాన్ని ఎవరో పట్టి పట్టి కోస్తున్నట్టనిపించింది.

ఇలాంటి అబద్ధపు అప నమ్మకపు మనుషులు ఈ కొండల మీదకి చేరి ఇంకా మిగిలిన మంచితనాన్ని ఏ అబద్ధంగా మారుస్తారు? ప్రతి రోజూ నేను నిజమే చెబుతున్నాను. అయినా అపనమ్మకంగా నిజమా? నిజమా?! అని అడుగుతూనే వుంది. ఇటువంటి వాళ్ళు ఎవరికీ నిజం చెప్పరా? వీళ్ళ చదువూ నాగరికతా అంతా వీళ్ళకు అబద్ధమే నేర్పిందా?!

ఇలాంటి వాళ్ళందరిదీ అబద్ధపు బతుకు జ్ఞానమేనా?!

ఇలాంటి అబద్ధపు బతుకు జ్ఞానం కలిగించడానికేనా ఇంతమంది కొండలెక్కి ఉద్యోగాలు వెలగబెడుతున్నారు? ఇలాంటి వాళ్ళు కొండల్లో నిండిపోతే గిరిజనులు అబద్ధాలకు ఆలవాలమైపోయి ఏ నేల బుగ్గిని మళ్ళీ నెత్తిన పోసుకుంటాయి?. ఇంకా ఏ రక్తాలు కక్కుతాయి?. ఏ దరిద్రపు దారిలోకి మారిపోతాయి?" అన్న బాధ ఆమెలో కలిగి కోపంతో ఊగిపోయింది!.

తళుకు బెళుకుల అమ్మాయి తొణుకూ బెణుకూ లేకుండా రాగల బస్సు కోసం చూస్తుంది!

అప్పుడు శాంతమ్మకు అంతా అయిపోయిన తరవాత వచ్చిన ఆఫీసరు జ్ఞాపకానికి వచ్చాడు.

అతడు గిరి సీమల్లో ఎలాంటి అబద్ధాన్ని ఎంత సున్నితంగా రవాణా చేస్తావో చూడు! చూడమనా?! నన్ను ఈ రోడ్డు పక్క పాకలో వుండమన్నాడు?

శాంతమ్మ కోపంగా మండుతున్న టీ పొయ్యిలో నీళ్ళు పోసింది.

అప్పుడు శాంతమ్మకు ఆఫీసరు "అమ్మా!" అని పిలిచిన పిలుపు ధ్వని హృదయంలో పలికింది.

ఆ పిలుపులోని గాఢత కడుపులోని పేగుల్ని సహితం కదల్చివేయగల ఆ సంబోధన!

"అమ్మా!" అన్న అమిత శక్తి సంపన్నమైన ఆ పిలుపులోనూ ఓంకార నాదమే!

ఆది మానవ స్త్రీ మూర్తిని ఆరాధించే అనాది వివాద వాదం!

"ఛ! అతను అలాంటి వాడు కాదు! అలనాడు అన్యాయాన్ని దహించ వేయడానికి ప్రయత్నించిన వివాద వాదం అణచివేయబడలేదా? అలాగే ఈ మంచి మనిషి మంచి ప్రయత్నం కూడా మాయగా మారిపోతుంది? అబద్ధం ఆక్రమించచేస్తుంది! ఈ అబద్ధపు జ్వాల అడవిని ఆక్రమించకముందే ఆర్పమని అతన్నే అడుగుతాను!" అనుకుంటూ ఆఫీసుకి బయల్దేరింది.

ఆఫీసులో అడిగితే అక్కడి వాళ్ళు

"ఆయన మారిపోయారన్నారు"

శాంతమ్మ హతాశురాలై తిరిగి వస్తూ అదే పనిగా మథన పడుతూ ఆలోచిస్తుంది.



"మంచితనముకొని ప్రారంభించిన పని మాయగా మారిపోతున్నప్పుడు తన పని మంచిదో చెడ్డదో తెలుసుకోవడానికైనా ఆ మంచి మనిషిని అక్కడ ఉంచరా?! అలా వుంచని ఉండని ఆ మంచి మనుషులు ఏ మంచిని ఎలా నిలబెట్టగలుగుతారు? ఏ పద్ధతిని ఎలా కాపాడగలుగుతారు?

ఆమెకు ఈ లోకం ఈ పద్ధతి బోధపడలేదు.

తిరిగి వచ్చి చూసే సరికి శాంతమ్మ టీపాకను తిరగదోసేసి నేలను సమ మట్టంగా మారుస్తున్నారు! అదేదో సంఘం వాళ్ళు ఆ టీ పాక స్థానంలో ప్యాసింజర్లకు విశ్రాంతి మందిరం కడతారట.

ఇదేమిటీ అత్యాచారం? ఇదెంత అన్యాయం?!

ఇంతవరకూ ఉన్న ఈ టీ పాక విశ్రాంతి మందిరం కాదా?!

మూడు కొండల మధ్య మూడు కొండ దిగిన కాలనీల మధ్య - మూడు రోడ్ల కూడలి మీద - ఒకరు పెట్టింది మరొకరు కూలదోస్తుంటే అడిగే దిక్కులేని దిక్కుమాలిన స్థితిని గమనించి ఆమె నిర్ఘాంతపోయి నిలబడిపోయింది.

గాలికి తురాయి చెట్టు నేలమట్టమైపోయిన శాంతమ్మ టీ పాక మీద తన ఎర్రని పూలను రాలుస్తుంది. కాగు చెట్టు తన పచ్చని ఆకుల్ని గల గలమని కదిలిస్తూంది.

నిర్ఘాంతపోయి దిక్కులు చూస్తున్న శాంతమ్మ చుట్టూ ఇప్పుడు కొండ గాలికి బదులు కొత్తగాలి అలుముకుంది.

హతాశురాలైన శాంతమ్మ చెవులకు ఇప్పుడు అనంత కాలావధిని లయిస్తున్న ఆది పురుషుని కాలి గజ్జె మువ్వ సవ్వడి ఆ కొత్త గాలిలో సన్నగా వినిపిస్తూంది!.

